పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-శంఖవరం: ప్రత్తిపాడు నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ప్రత్తిపాడు శాసన సభ్యులు పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ తెలిపారు. గురువారం శంఖవరం మండలంలోని నెల్లిపూడి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంపీపీ పర్వత రాజబాబు, ఎంపీడీవో జే రాంబాబులతో కలిసి నిర్వహించారు. వైసీపీ మండల కన్వీనర్ నరాల శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కౌలుకార్డుతో రైతులకు మేలు

విశాలాంధ్ర-పెద్దాపురం: కౌలు కార్డుతో కౌలు రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి కొమ్మోజు సంజయ్ కుమార్ అన్నారు. గురువారం పెద్దాపురం మండలం ఆనూరు రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో కౌలు రైతుల ఎంపికపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నూకపల్లి అనిత రాణి, గ్రామ పెద్దలు కునాపురెడ్డీ స్వామి, సింగన త్రిమూర్తులు, నూకపల్లి నరేష్, గ్రామ రైతులు, గ్రామ రెవెన్యూ అధికారి ఆర్ పద్మరాజు,రైతు భరోసా కేంద్రం ఇంచార్జి జి చంద్రరావు, వాలంటీర్లు పాల్గొన్నారు. కౌలు కార్డ్ కావలసిన కౌలు రైతులు గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద వారి పూర్తి వివరాలతో సంప్రదించాలని తెలియజేసారు.

చదరంగంతో ఏకాగ్రత

విశాలాంధ్ర-పెద్దాపురం: చదరంగం మనిషిలో ఏకాగ్రత పెంచడానికి దోహదపడుతుందని చదరంగం అంతర్జాతీయ క్రీడాకారుడు ముప్పన సంతోష్ అన్నారు. పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యాసలపు సూర్యారావు భవన్‌లో జరుగుతున్న సమ్మర్ క్యాంప్‌ను ఆయన సందర్శించి విద్యార్థులకు చెస్‌కు సంబంధించిన అంశాలను వివరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎమ్ఎస్‌సి మూర్తి మాథ్స్ బోధించారు. సెల్ఫ్ డిఫెన్స్ దుంగల పూజితా సూర్యశ్రీ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రొంగల అరుణ్, కూనిరెడ్డి అరుణ, రవి కుమార్, డి కృష్ణ, అమృత, నమ్రత, మంజులా, రవి, సూరజ్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

మెర్లపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర-ఆత్రేయపురం: మండలం కేంద్రంలో మెర్లపాలెం గ్రామంలో ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును వివరించి సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలని ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి కోరారు. ఆత్రేయపురం మండలం మెర్లపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ మరియు శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి గురువారం నిర్వహించారు. గ్రామంలో ప్రతీ ఇంటికి వెళ్ళి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి ప్రజల వద్ద నుండి ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎవరెన్ని విమర్శలు చేసినా ప్రజలకు మంచి చేయాలనే సంకల్పంతోనే ప్రయాణం చేస్తున్నామని, సాధ్యమైనంత మంచి చేసి చూపిస్తున్నామని తెలియచేశారు.

కౌలు కార్డు నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర-కిర్లంపూడి: కౌలు రైతులు విధిగా కౌలు కార్డు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిని జోకా అమృత తెలియజేశారు. గురువారం కిర్లంపూడి మండలంలో గోనేడ గ్రామంలో, కౌలు కార్డుల గ్రామ సభ నిర్వహించారు. ఉప సర్పంచి గోనేడ, మోటేపల్లి గణపతి వీఆర్వోలు, గ్రామ కార్యదర్శి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు హరిత, పలువురు కౌలు రైతులు హాజరయ్యారు.

సమస్యల వెల్లువ

విశాలాంధ్ర-నిడదవోలు: టీడీపీ చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజల నుండి సమస్యల వినతులు వెల్లువెత్తాయని నిడదవోలు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు అన్నారు. రాష్ట్ర ప్రజలు ఇదేం ఖర్మ జగన్‌తో మన రాష్ట్రానికి అనే పరిస్థితి నుంచి రాష్ట్ర ప్రజలు బయటపడాలంటే చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవడం అవసరమని శేషారావు అన్నారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ముగిసిన నేపథ్యంలో ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వచ్చిన వినతులు రాజమండ్రి టీడీపీ ఎంపీ కార్యాలయానికి పంపుతామని, తదుపరి జరిగే సమావేశాల్లో దీనిపై చర్చిస్తామని పేర్కొన్నారు.

ఆక్రమిత శ్మశానం భూమి స్వాధీనం

విశాలాంధ్ర-గోపాలపురం: ప్రభుత్వ శ్మశాన భూమిని ఆక్రమించుకున్న వ్యక్తు నుంచి రెవెన్యూ అధికారులు భూమిని స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని సాగిపాడు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి సర్వేనెంబర్ 79/1 నందు సుమారు4 ఎకరాల భూమి స్మశాన వాటిక గా ఉండేది అయితే గత కొన్నాళ్ల క్రితం ఒక వ్యక్తి దానిని ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నాడు. ప్రభుత్వం భూములు రి సర్వేలో భాగంగా ఆ భూమిని తాసిల్దార్ బి. రవీంద్రనాథ్ స్మశాన వాటికగా గుర్తించి ఆక్రమించుకున్న వ్యక్తికి భూమిని ఖాళీ చేయాలని తెలియజేయడం జరిగింది. అయితే ఆ భూమిని ఆక్రమించుకున్న వ్యక్తి కోర్టును ఆశ్రయించడం జరిగింది. అయితే కోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో తహసిల్దార్ రవీంద్రనాథ్ రెవిన్యూ సిబ్బంది పోలీస్ యంత్రాంగం సహాయంతో జెసిబి ద్వారా స్మశాన వాటికను బాగు చేయించే పనిలో నిమగ్నమైనట్లు తాసిల్దార్ రవీంద్రనాథ్ తెలిపారు.

పొగాకు బోర్డుకు ఆర్వో వాటర్ ప్లాంట్ బహూకరణ

విశాలాంధ్ర-గోపాలపురం: గోపాలపురం పొగాకు బోర్డుకు మినీ ఆర్.ఓ వాటర్ ప్లాంట్‌ను పిన్నమనేని గోపాలకృష్ణ రావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు బహూకరించడం అభినందనీయమని గుంటూరు పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు ఐఏఎస్ అన్నారు. బుధవారం గోపాలపురం పొగాకు వేలం కేంద్రం నందు పిన్నమనేని గోపాలకృష్ణ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు భార్య నిర్మల, కుమారులు పిన్నమనేని మధుమోహన్ (వర్జీనియ పొగాకు రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షులు), వెంకట రామారావు, శ్రీనివాస సుభాష్ చంద్రబోస్ కుటుంబ సభ్యులు సుమారు లక్ష రూపాయలు విలువ గల మినీ ఆర్వో వాటర్ ప్లాంట్ ను బహూకరించారు. దీన్ని రీజనల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య, వేలం నిర్వహణ అధికారి అమాల్ డి.శామ్ ఆధ్వర్యంలో గుంటూరు పొగాకు బోర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు ప్రారంభించారు. అనంతరం పొగాకు వేలం కేంద్రం నందు కొనుగోళ్ల ప్రక్రియలో నేరుగా పాల్గొని పొగాకు నాణ్యతను పరిశీలించారు.

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సత్కారం

విశాలాంధ్ర-కాకినాడ: రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు అనుగుణంగా జిల్లాలో ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలలో పదోతరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను నియోజకవర్గం, జిల్లా స్థాయిలో సన్మానించడం జరుగుతుందని ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టరు డా కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం రాష్ట్ర సమగ్ర శిక్ష కార్యాలయం నుంచి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ.. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ ఇతర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టరు డా కృతికాశుక్లా..జాయింట్ కలెక్టరు ఎస్ ఇలక్కియా, జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులతో కలిసి హాజరయ్యారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఏప్రిల్-2023, ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి మార్చ్-2023 పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల జాబితాను నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో సిద్ధం చేయాలని అదేవిధంగా ఈ కార్యక్రమానికి సంబంధించి ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం చేసే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టరు విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. వీసీలో జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎస్ఎస్ అన్నపూర్ణ, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు

విశాలాంధ్ర-కాకినాడ/అమలాపురం: జిల్లాలోని సాగునీటి కాలువలలో పూడికతీతలు, అవసరమైన చోట షట్టర్ మరమ్మత్తు పనులు, కాలువ ఒడ్డులు పటిష్టం చేయడం వంటి పనులు ప్రాధాన్యతపై పూర్తి చేసి ఖరీఫ్ పంటకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ప్రాంతాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

గురువారం ఉదయం అమలాపురం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న, ప్రస్తుతం జరుగుతున్న ఇరిగేషన్ పనులపై ఇరిగేషన్ అధికారులతో, వివిధ ఇతర పనులపై ఇతర జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో షట్టర్లు, ఔట్ ఫాల్ స్లూయిజ్‌ల మరమ్మత్తు పనులు, కాలువల పూడిక తీత పనులకి సంబంధించి ప్రతిపాదనలు ఏమైన ఉంటే వెంటనే కలెక్టర్ కార్యాలయానికి పంపాలని వీలైనంత త్వరగా పరిపాలన అనుమతులు మంజూరు చేస్తామని కలెక్టర్ ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కె సుబ్బయ్య(డ్రైన్స్), కాశీ విశ్వవేశ్వరరావు(హెడ్ వర్క్స్)విజయ గోపాల్ (ఈస్ట్రన్ డివిజన్)డి రామ్ గోపాల్ (సెంట్రల్ డివిజన్), పీడీ డ్వామా మధుసూధన్, యస్ ఈ పంచాయతీ రాజ్ చంటి బాబు, సిపిఓ వెంకటేశ్వర్లు, యస్ఈ అర్ డబ్లుయస్ కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

22న కాకినాడలో మినీ మహానాడు

విశాలాంధ్ర- కాకినాడ: ఈ నెల 22వ తేదీన కాకినాడ జిల్లాలో టీడీపీ కార్యాలయంలో మినీమహానాడు నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ మహానాడుకు రాష్ట్ర, జిల్లా, మండలస్థాయి నాయకులను ఆహ్వాని స్తున్నామన్నారు. ఎన్టీఆర్ శతవసంతాల వేడుక సందర్భంగా ఆయా జిల్లాల్లో నిర్వహించిన మినీమహానాడుకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. 27, 28 తేదీల్లో రాజమండ్రిలో భారీఎత్తున మహానాడు నిర్వహిస్తున్నామని, 27వ తేదీన లక్ష మందికి, 28న రెండులక్షలమందికి భోజనవసతి ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. జిలాని, సాయితేజ, సత్యనారాయణ, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర-సీతానగరం: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం వెలుగుచూసింది. మండలంలో గల బొబ్బిలిలంక గ్రామంకు చెందిన కాకర్ల త్రిమూర్తులు వయస్సు 40 పురుగుల మందు తాగి హత్మహత్య చేసుకున్నాడు. త్రిమూర్తులు హైదరాబాదులో రెండు రెస్టారెంట్లను నడుపుతున్నాడు. వీటి అవసరాల నిమిత్తం ఫోన్ యాప్ ద్వారా లోను పొందడమే కాకుండా తన స్నేహితుల దగ్గర కూడా అప్పులు తీసుకున్నాడని అన్నారు. ఈ ఫోన్ యాప్, స్నేహితులకు డబ్బులు కట్టలేని పరిస్థితుల్లో పురుగులు మందు సేవించి ఆత్మహత్య ప్రయత్నం చేయగా ఇంటిలోని వారు గమనించి రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించగా పరిస్థితి ఆందోళనగా ఉండడంతో అక్కడ నుండి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు కానీ అక్కడ వైద్యం పొందుతో గురువారం ప్రాణాలు విడిచాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

జిల్లా కలెక్టర్‌లతో ఎన్నికల సీఈఓ సమావేశం

విశాలాంధ్ర-కాకినాడ: రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా గురువారం మద్యా హ్నం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఫోటో ఎపిక్ కార్డుల పంపిణీ, కొత్త జిల్లాల్లో ఈవి యం గొడౌన్ల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అనుసరించాల్సిన స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ల పై వివిద జిల్లాల కలెక్టర్లు తమకు సూచించిన అంశాలపై రూపొందించిన ప్రెజెంటేషన్లు సిఈఓకు వివరించారు. జిల్లా కలెక్టర్ డా కృతికా శుక్లా, ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సిబ్బంది డేటా బేస్ ప్లానింగ్ అంశం గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జడ్ పి సిఈఓ ఎన్‌వివి సత్యన్నారాయణ, ఇన్‌చార్జి డిఆర్ఓ కె శ్రీరమణి, కుడా విసి కె సుబ్బారావు, ఆర్డిఓలు బివి రమణ, జె సీతారామారావు, డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

రాజమండ్రిలో ఎక్స్‌పీరియన్స్ జోన్

రాజమండ్రి: ఇమేజింగ్ టెక్నాలజీలో అగ్రగామి నికాన్ కార్పోరేషన్‌కు 100 శాతం అనుబంధ సంస్థ అయిన నికాన్ ఇండియా, తమ నూతన ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి వద్ద ప్రారంభించింది. ఇది జైన్ డిజిటల్ షాపీ, స్టేడియం రోడ్, ఇన్నీస్‌పేట వద్ద ఉంది. ఈ ఎక్స్‌పీరియెన్స్ జోన్‌ను నేడు నికాన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సజ్జన్ కుమార్ ప్రారంభించారు. ఈ ప్రాంతంలోని ఫోటోగ్రఫీ మరియు వీడియో గ్రఫీ ప్రతిభకు నికాన్ యొక్క ప్రపంచ శ్రేణి ఉత్పత్తులతో కూడిన నిధిని ఈ ఎక్స్‌పీరియన్స్ జోన్ అందుబాటులోకి తీసుకురానుంది. రాజమండ్రిలోని నికాన్ యొక్క ఎక్స్‌పీరియన్స్ జోన్ అత్యంత సౌకర్యవంతంగా మరియు లీనమయ్యే అనుభవాలను అందించే రీతిలో తీర్చిదిద్దబడింది. ఇక్కడ విస్తృతశ్రేణిలో ఉత్పత్తులు వినియోగదారులకు అందుబాటులో ఉంటాయి. వీటిలో నికాన్ యొక్క విప్లవాత్మక మిర్రర్ లెస్ సిరీస్, డీఎస్ఎల్ఆర్ శ్రేణి కెమెరాలతో పాటుగా హై జూమ్ కూల్‌పిక్స్ కెమెరాలు, లెన్స్‌లు, యాక్ససరీలు నికాన్ సపోర్ట్ ఆప్టిక్స్ శ్రేణి వంటివి ఉంటాయి.

వేసవి విజ్ఞాన శిబిరంలో పవర్ గేమ్స్ పోటీలు

విశాలాంధ్ర-జగన్నాథపురం/కాకినాడ: జగన్నాథపురం, కాకినాడ శాఖా గ్రంథాలయంలో 18న నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరము 11వ రోజు విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహణకు బాల వేదిక కన్వీనర్, ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత నోరి బలరామకృష్ణ వచ్చిన విద్యార్థులచే మెదడుకు మేత, మైండ్ పవర్ గేమ్స్ మరియు మొక్కలు చెట్లు గురించి పాటలు పాడి అలరించారు. మైండ్ పవర్ గేమ్స్‌తో ఆటలు ఆడించి విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సంగీత కళాకారులు చక్రవర్తుల సీతారామయ్య విద్యార్థులకు సంగీత వాయిద్యాలతో శిక్షణ ఇచ్చారు. చివరగా క్రాఫ్ట్ ఉపాధ్యాయులు బి రామకృష్ణ విద్యార్థులచే పేపర్ కటింగ్స్‌తో వివిధ రకాల పండ్లు కాయగూరలు తయారు చేయించారు.

కాకినాడ గ్రంథాలయంలో సంగీత శిక్షణ

విశాలాంధ్ర-కాకినాడ: స్థానిక వివేకానంద్ పార్కులోని గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా 11వ రోజు అయిన 18వ తేదీ గురు వారం పాఠశాల విద్యార్థులకు సంగీతంలో శిక్షణ ఇచ్చారు. పాఠశాల విద్యార్థులకు సంగీతం మాస్టారు డాక్టర్ చక్రవర్తుల సీతారామయ్య పాటలను నేర్పించారు. పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్తు తీగలు

విశాలాంధ్ర- కాకినాడ/ జగ్గంపేట: గండేపల్లి మండలం బొర్రంపాలెంలో నేలకు గజం ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలను చూసి రైతులు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. రైతు సింద్రుపు సత్యనారాయణ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా నేలకు గజం ఎత్తులో వేలాడుతు కరెంట్ షాక్ ప్రమాదాలు తరచూ జరుగుతున్నా సంబంధిత శాఖ పరిష్కరించడంలో చూపడలంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్యుత్తు తీగలు చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయి. దీంతో రాత్రి సమయాల్లో వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాలంటే రైతులు జంకుతున్నారు. అయితే నిర్వహణ కొరవడి విద్యుత్తు తీగలు క్రమేణా సాగి నేలకు సుమారు గజం ఎత్తుకు చేరాయి. పొలాల్లో నేలకు తాకేలా వ్రేలాడుతున్న విద్యుత్తు వైర్లను సరి చేయాలంటూ పలుమార్లు విద్యుత్తు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతు సత్యనారాయణ పేర్కొన్నారు.

ఫిజిక్స్ వాలా స్కాలర్ షిప్‌కు ప్రణాళికలు

రాజమండ్రి: గత విద్యా సంవత్సరంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇప్పటికే వంద కోట్లకు పైగా ప్రోత్సాహకాలను అందించిన ఫిజిక్స్ వాలా వచ్చే విద్యా సంవత్సరంలో నాణ్యమైన ఆఫ్ లైన్ విద్యకు అర్హులైన విద్యార్థులకు 160 కోట్ల విలువైన స్కాలర్షిప్లను అందించాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఫిజిక్స్ వాలా వ్యవస్థాపకుడు అలఖ్ పాండే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ వ్యాప్తంగా అర్హులైన విద్యార్థులకు స్కాలర్షిప్, మెంటర్షిప్ ద్వారా అసాధారణమైన విద్యావకాశాలను అందించడంలో ఫిజిక్స్ వాల్లా తిరుగులేని నిబద్ధతకు ఫిజిక్స్ వాలా, స్కాలర్షిప్ అడ్మిషన్ టెస్ట్ నిర్వహణ నిలుస్తుందన్నారు. మా స్కాలర్షిప్ ప్రోగ్రామ్ సాధ్యమైనంత ఎక్కువ మంది విద్యార్థులను శక్తివంతం చేసేలా రూపొందించామన్నారు. అందుకే మేము దీన్ని అనేక దశల్లో నిర్వహిస్తాము. ఆన్లైన్, ఆఫ్లైన్ పరీక్షా రీతులను ఎంచుకునే సౌలభ్యాన్ని విద్యార్థులు కలిగి ఉంటారన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో, మేము రూ.160 కోట్ల విలువైన స్కాలర్షిప్లను ప్రదానం చేసేందుకు ప్రణాళికను రూపొందించుకున్నామనీ, ఇప్పటికే రూ.100 కోట్ల రివార్డులను ప్రతిభావంతులైన విద్యార్థులకు అందజేశామన్నారు.

పేదల వైద్యుని కుటుంబాన్ని ఆదుకుందాం

విశాలాంధ్ర-ఏలేశ్వరం: అనకాపల్లి జిల్లా నక్కపల్లికి చెందిన పేదలకు ఉచితంగా సేవలందించే బిహెచ్ఎంపీఏ అసోసియేషన్ రాష్ట్ర సభ్యులు పి కిరణ్ కుటుంబాన్ని ఆదుకోవడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని బిఎంపి అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు, ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్షుడు అందే చిట్టికొండ పిలుపునిచ్చారు. ఆయన గురువారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కుటుంబం మొత్తం గాయాల పాలై కన్న కొడుకుని కడసారి కూడా చూసుకోలేని దుస్థితిలో కుటుంబం మొత్తం ఆస్పత్రి పాలైన చికిత్స పొందుతున్న కిరణ్ కుటుంబాన్ని ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు రావాలని కోరారు. ఆర్థిక సహాయం అందించే దాతలు ఫోన్ పే నెంబర్ 7659870870కు పంపాలని విజ్ఞప్తి చేశారు. ప్రకటన విడుదల చేసిన వారిలో గ్రామీణ వైద్యులు కేళిం వెంకటేశ్వరరావు (ఏలేశ్వరం), గుండేపల్లి ప్రసాద్(ఎర్రవరం) ఉన్నారు.

విద్యతోపాటు వృత్తి నైపుణ్యమూ ఉండాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: ప్రాథమిక స్థాయిలో విద్యతోపాటు వృత్తి నైపుణ్యాన్ని కూడా పెంపొందించుకోవాలని సామాజిక విశ్లేషకులు అధ్యాపకులు ఈడూరి గంగరాజు పిలుపునిచ్చారు దేవరపల్లి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన సదస్సులో భాగంగా విద్యార్థులకు వివిధ అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విద్య ఎంతో విలువైనది అన్నారు ప్రాథమిక విద్యతోపాటు చేతువృత్తులు వృత్తిని పుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో విద్యార్థులకు కావలసిన విషయ పరిజ్ఞానం పూర్తిస్థాయిలో తెలుసుకోవచ్చని అన్నారు ప్రతి విద్యార్థి సంస్కారవంతమైన విద్యను అభ్యసించాలని ఆయన పిలుపునిచ్చారు ఇంగ్లీషు తెలుగు సామాజిక విషయాలపై విద్యార్థులు వివరించారు గ్రంథాలయాధికారి కే వి వి ప్రసాద్ విజ్ఞాన సదస్సుల ఆవశ్యకతను వివరించారు ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-చాగల్లు: చాగల్లు మండలం మల్లవరం గ్రామం లోని వృద్ధాశ్రమంలో వాడపల్లి గ్రామ వాస్తవ్యులు కరుటూరి వెంకట్రావు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించి అనంతరం ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేసిన రాజమహేంద్రవరం పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాజీ మంత్రి వర్యులు కె.ఎస్ జవహర్. ఈ కార్యక్రమంలో మల్లవరం గ్రామ కమిటీ ప్రెసిడెంట్ లకంసాని భద్రం , పార్లమెంట్ అధికార ప్రతినిధి బూరుగుపల్లి వీర రాఘవులు, జిల్లా వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి కోడూరి ప్రసాద్, చాగల్లు మండల టిడిపి సీనియర్ నాయకులు కరుటూరి సతీష్, టిడిపి సీనియర్ నాయకులు కోడూరి కాశీ, మార్కొండపాడు గ్రామ కమిటీ ప్రెసిడెంట్ బండి శ్రీను, మార్కొండపాడు గ్రామ బీసీ నాయకులు హరికృష్ణ పాల్గొన్నారు.

విశాలాంధ్ర
గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

అర్హులైన వారందరికీ ఇళ్ల పట్టాలు

విశాలాంధ్ర-దేవరపల్లి: అర్హులైన వారి అందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించుకోవటానికి సహకారం అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దేవరపల్లి ఆయన క్యాంపు కార్యాలయంలో బంధపురం గ్రామానికి చెందిన 35 మందికి ఇండ్ల నిర్మించుకోవటానికి పొజిషన్ సర్టిఫికెట్లను ఆయన అందజేశారు. తాసిల్దార్ రామకృష్ణ దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు రాష్ట్ర అత్తిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు దేవరపల్లి మండల వైసీపీ అధ్యక్షుడు కూచిపూడి వీర వెంకట సత్యనారాయణ బంధపురం ఎంపీటీసీ సొంటి కాశీ విశ్వనాథం వైసీపీ నేతలు పచ్చ రాంగోపాల్ కామిశెట్టి దుర్గారావు దుగ్గిన గంగాధరరావు మాధవరపు వెంకటేశ్వరరావు పెనుబోతుల సుబ్బారావు సుంకర రాంబాబు సుంకర గంగరాజు కవల శ్రీనివాస్ ఎస్కేపల్లి ఎం శ్రీనివాసరావు దుగ్గిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

విశాలాంధ్ర-చాగల్లు: మండలంలోని మార్కొండపాడు గ్రామంలో యడవల్లి రత్తయ్య సతీమణి ఇటీవల మరణించడం జరిగింది. ఈ నేపథ్యంలో ఆమె కుటుంబ సభ్యులను మాజీ మంత్రి జవహర్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే రత్తయ్య కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

సబ్సిడీపై యంత్రపరికరాలు

విశాలాంధ్ర-దేవరపల్లి: వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేయడానికి వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు తమ ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తుందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దేవరపల్లి మండలం బందపురం గ్రామానికి చెందిన బాలం రామకృష్ణ చెందిన గ్రూపుకు ట్రాక్టర్లు సబ్సిడీపై అందజేశారు. దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు దేవరపల్లి మండల వైసీపీ అధ్యక్షుడు కూచిపూడి వీర వెంకట సత్యనారాయణ వైసీపీ నేతలు పచ్చ రాంగోపాల్ మాధవరపు వెంకటేశ్వరరావు దుగ్గిన గంగాధరరావు దుగ్గిన ప్రసాద్ సుంకర రాంబాబు సుంకర గంగరాజు బాలం రామకృష్ణ పాల్గొన్నారు.

భానుడి ప్రతాపం.. మూతపడుతున్న షాపులు

విశాలాంధ్ర-రౌతులపూడి: నాలుగు రోజుల నుండి భానుడు తీవ్రమైన ఎండ ప్రభావంతో మధ్యాహ్న సమయంలో జన సంచారం లేక షాపులు మూతపడ్డాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ప్రభావాన్ని తట్టుకోలేక ప్రజలు మధ్యాహ్న సమయంలో ఇళ్ళకే పరిమితమవుతున్నారు. దీనితో ఎప్పుడు రద్దీగా ఉండే రౌతులపూడి సినిమా సెంటరు వాహనాలు కూడా తిరగక ప్రజలు కూడా రోడ్డు మీదకు రాకపోవడంతో ఆ ప్రాంతమంతా జనసంచారం లేని నిర్మానుష్యంగా మారింది. ఇదేవిధంగా ఇంకా కొన్ని రోజులు ఎండలు కొనసాగితే ఏ విధమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రజల ఆందోళన చెందుతున్నారు.

అంబాజీపేటలో ఎండలు భగభగ

విశాలాంధ్ర-అంబాజీపేట: ఎండాకాలం అయినప్పటికీ కొన్ని రోజులు వర్షాలతో వాతావరణం చల్లగా ఉంది. ఇప్పుడు తీవ్రమైన ఎండలు వచ్చాయి. ఉదయం ఏడు గంటల నుంచే ఎండలు మండుతున్నాయి. పది గంటలకే భగభగ మండుతున్న ఎండకు జనం రోడ్లపైకి రావడం లేదు. సాయంత్రం ఐదు గంటల వరకు ఇదే పరిస్థితి. ఎండల వల్ల పనులన్నింటికీ ఆటంకం కలుగుతుంది. ఎండలు ఎక్కువగా ఉండడంతో ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. జిల్లాలో సగటున 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. జిల్లాలో ఎండల తీవ్రత కాస్త ఎక్కువగానే ఉంది. ఈ ఎండకాల సీజన్‌లో చాలా రోజులు అకాల వర్షాలతో సాధారణ వాతావరణం ఉంటుంది. వర్షాలు ఆగిపోయి ఎండలు మండిపోతున్నాయి.

ఆసుపత్రిల్లో వసతులపై ఎమ్మెల్యే ఫైర్

విశాలాంధ్ర-జగ్గంపేట: జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వసతులు కల్పించడంలో అలసత్వం వహిస్తున్న వైద్యులు రమేష్ పై జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు మండిపడ్డారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయా శాఖల పనితీరును అధికారులు వివరించారు. ఆస్పత్రిలో జనరేటర్, స్కానింగ్ మిషన్, ఎక్స్‌రే మిషన్ నిరుపయోగంగా ఉన్నాయని వచ్చిన వార్తలకు ఎమ్మెల్యే స్పందించారు. రెండు రోజుల్లో జనరేటర్ వినియోగంలోకి రావాలని, 12రోజుల్లో స్కానింగ్, ఎక్స్రే మిషన్లు అందుబాటులోకి రావాలని ఆదేశిం చారు. జడ్పిటిసి ఒమ్మి బిందు మాధవి రఘురామ్, ఎంపీపీ ఆత్తులూరి నాగబాబు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీడీవో హరికృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

విశాలాంధ్ర-సామర్లకోట: భారత్ మాత సేవ పరిషత్ అధ్యక్షుడు గోరకపూడి చిన్నయ్య దొర ఆధ్వర్యంలో పది పరీక్షల్లోనే, ఇంటర్ పరీక్షల్లోనే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్న వ్యక్తికి సన్మానం చేసి గౌరవించారు. రిక్షా కార్మికులకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గోలి వెంకట అప్పారావు చౌదరి, డాక్టర్ పసాల సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 7530 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలో గల 21 పంచాయితీల పరిధిలో గల గ్రామాల్లో దాల్వా సాగులో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకూ 7530 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి సూర్య రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా సూర్య రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా కేంద్రాల ద్వారా దాల్వా సాగు ధాన్యం సేకరణ వేగవంతం జరిగింది అని అన్నారు. మండల వ్యాప్తంగా 600 నుండి 700 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని అన్నారు. ధాన్యం కొనుగోలు సహకరించిన రైతులకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.